క్లుప్తంగా

సభలు, నిరసనలకు అనుమతులు తప్పనిసరి

ఎర్రగుంట్ల : జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని సభలు, ర్యాలీలు, నిరసనలు నిర్వహించాలంటే ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని జమ్మలమడుగు డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. మంగళవారం ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 వరకు ఎర్రగుంట్ల, కలమల్ల పోలీస్ స్టేషన్‌ల పరిధిలలో పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉందన్నారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసనలు చేపట్టలాంటే 24 గంటల ముందు లిఖితపూర్వకంగా పోలీసుల ముందస్తు అనుమతులు పొందాలన్నారు.

నేడు మాంసం విక్రయాలు నిషేధం

పులివెందుల టౌన్/కమలాపురం/ఎర్రగుంట్ల/జమ్మలమడుగు : ఈనెల 2వ తేదీన బుధవారం మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా జంతు వధ, మాంసం విక్రయాలు నిషేధమని ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంతు వధ శాలలు, చికెన్, మటన్, చేపల అమ్మకం దుకాణాలు మూసి వేయాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బైక్ చోరీలను అరికడదాం

ఎర్రగుంట్ల : బైక్‌లకు లాక్ వేయడం ద్వారా చోరీలను అరికట్టవచ్చని యర్రగుంట్ల పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు అలవాటు పడిన కొందరు బైక్ చోరీలకు పాల్పడుతున్నారని చెప్పారు. దుండగులు బైక్‌ల వద్ద తచ్చాడుతూ నకిలీ తాళాలను ఉపయోగించి చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. బైక్ ముందు వీల్‌కు లాక్ వేయడం చోరీలను నివారించవచ్చని పేర్కొన్నారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఆశ్రమానికి ప్రశంసా పత్రం

ఎర్రగుంట్ల : తిప్పలూరు గ్రామంలోని ఎద్దుల పెద్ద శేషమ్మ అనాధ ఆశ్రమానికి ప్రశంసం పత్రం లభించింది. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎద్దుల పెద్ద శేషమ్మ ఆనాధ ఆశ్రమం వ్యవస్థాపకులు ఎద్దుల నాగేంద్ర జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

నేడు ఉపాధి హామీ గ్రామసభలు

సింహాద్రిపురం : మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని బుధవారం నుంచి ప్రతి గ్రామంలో ఉపాధి హామీ గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రజలు అవసరమైన పనులు గుర్తించి తెలియజేయాలన్నారు.

బహుమతుల ప్రదానం

లింగాల : మండల కేంద్రమైన ఎగువ లింగాల జిల్లా పరిషత్ హైస్కూలులో జరిగిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో లింగాల హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, పెద్ద కుదాల హైస్కూల్ విద్యార్థులు రెండవ స్థానం, పార్నపల్లి హైస్కూల్ విద్యార్థులు మూడవ స్థానం సాధించారని పాఠశాల హెడ్‌మాస్టర్ ప్రసాద్, జేవీవీ మండల కన్వీనర్ రఘునాథరెడ్డిలు తెలిపారు.

చక్కటి జీవన శైలితో గుండెకు రక్షణ

కమలాపురం : మంచి ఆహారపు అలవాట్లతో పాటు చక్కటి జీవన శైలిని అలవరచుకుంటే గుండెను కాపాడుకోవచ్చని పెద్దచెప్పలి పీహెచ్‌సీ వైద్యుడు మెహరూన్, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఓబుళ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ గుండె సంరక్షణ వారోత్సవాలలో భాగంగా జడ్పీ పాఠశాలలో మంగళవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు వేసిన డ్రాయింగ్ షీట్లు చేతబట్టుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

గాంధీ జయంతిని విజయవంతం చేయండి

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే ఆఫీస్‌లో బుధవారం మహాత్మ గాంధీజీ జయంతిని పురస్కరించుకుని ఉదయం 9.30గంటలకు గాంధీజీకి నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు హాజరవుతారని వైఎస్సార్‌సీపీ పార్టీ వర్గాలు తెలిపాయి. అలానే గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 8:30గంటలకు గాంధీ విగ్రహానికి, అలాగే పట్టణంలోని గాంధీ సర్కిల్ ఉన్న గాంధీజీ విగ్రహానికి ఉదయం 9గంటలకు నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

చెట్టును ఢీ కొన్న కాలేజీ బస్సు

కమలాపురం : కమలాపురం–పెద్దచెప్పలి మార్గం జంగంపల్లె సమీపంలో ప్రగతి జూనియర్ కళాశాలకు చెందిన బస్సు చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయంతో గాయపడ్డ విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు. అయితే చెట్టు ఉండటంతో పెద్ద ప్రమాదమే తప్పిందని, చెట్టులేక పోతే బస్సు రోడ్డు పక్కనే ఉన్న గుంతల్లో పడి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనలో చిత్రశ్రీ, వెంకట హారీషతో పాటు మరో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు
ముస్తాబైన అమ్మవారిశాల

పులివెందుల టౌన్ : పట్టణంలో దసరా శరనవరాత్రుల మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. దసరా మహోత్సవాలలో భాగంగా ఆలయాల్లో అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో స్థానిక అమ్మవారిశాలలో ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. ఈనెల 3వ తేదీనుంచి 13వ తేదీవరకు శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలలో మొదటిరోజు గణేశ గోప్రార్థన పంచగవ్యం, రక్షాబంధనం, సర్వదేవతా ఆహ్వాన కలశస్థాపన చేయనున్నారు. అదేరోజు సాయంత్రం అమ్మవారు శ్రీ బాలత్రిపుర సుందరీదేవి అలంకారంతో దర్శనమివ్వనున్నారు. 4న శ్రీమీనాక్షిదేవిగా, 5న అర్ధనారీశ్వరిగా, 6న శ్రీగాయత్రిదేవిగా, 7న ఉదయం శ్రీవనవిహారి, రాత్రి శాకంబరిగా, 8న శ్రీఅన్నపూర్ణదేవిగా, 9న శ్రీసరస్వతిదేవిగా, 10న శ్రీమహిషాసురమర్దిని, 11న శ్రీగజలక్ష్మిదేవి, 12న ఉదయం శ్రీవిజయలక్ష్మిదేవి, సాయంత్రం శమీ దర్శనం, రాత్రి అమ్మవారి గ్రామోత్సవాలు, 13న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. చివరి రోజు ఉదయం వసంతాలు, సాయంత్రం పాన్పు సేవతో ఉత్సవాలు ముగియనున్నాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త రవికుమార్ తెలిపారు. అలాగే అంకాలమ్మ ఆలయంలో దేవీ శరనవరాత్రుల ఉత్సవాల సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించనున్నామ ని చెప్పారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో వెలసిన మాలే గంగమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు వేడుకగా నిర్వహించనున్నారు.

స్థానిక నారాయణ పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని తయారుచేసి పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నవదేవతల వేషధారణలలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల ఏజీఎం కిరణ్ పాల్గొని విద్యార్థులకు పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ అంజనదేవి, ఈ–కిడ్స్ వైస్ ప్రిన్సిపల్ శ్రావణి, హైస్కూల్ డీన్ భాస్కర్, త్రివేణి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పులివెందుల : అమ్మవారిశాల వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



పులివెందుల టౌన్ : వేషధారణలో విద్యార్థినులు



లింగాల : ఆకట్టుకున్న విద్యార్థినుల వేషధారణలు



వేంపల్లి : నృత్య ప్రదర్శనలో చిన్నారులు

ఆకట్టుకున్న ముందస్తు దసరా వేడుకలు

లింగాల : కామసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దసరా పండుగ విశిష్ట, అమ్మవారి పది అలంకారాలు, జమ్మిచెట్టు పూజ, రావణ దహన కార్యక్రమాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినుల చేత అమ్మవారి అలంకారాల వేషధారణలో అందరిని అలరించాయి. వేడుకలలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యారు.

శ్రీ చైతన్య హైస్కూల్‌లో..

వేంపల్లి : స్థానిక శ్రీ చైతన్య హైస్కూలులో ముందస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ప్రాధాన్యతను వివరించారు. దసరా అనేది చెడుపై మంచి విజయం సాధించిన రోజు అని, మనం దుర్గామాతకు పూజలు చేసి, జీవితంలో ధర్మం పాటించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అందరినీ అలరించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి, డైరెక్టర్స్ బి.చేతన్ రెడ్డి, బి.చైతన్య రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

లింగాల : లింగాల మండలం అంబకపల్లె గ్రామంలోని శ్రీగంగమ్మతల్లి ఆలయంలో బుధవారం నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ గ్రామంలోని గంగమ్మ ఆలయంలో ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామన్నారు. ఆయా తేదీలలో ప్రతి రోజు అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృత సుగంధ ద్రవ్య పుణ్య నదీజల సహిత మహాస్నపన అభిషేకం, వస్త్ర, పుష్పాలంకరణ, మంత్రపుష్ప నీరాజనములు, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం ఉంటుందన్నారు. ఉత్సవాలలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎక్సైజ్ సీఐగా విన్నీలత

ముద్దనూరు : స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విన్నీలత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా విన్నీలత ఆదోని నుంచి ముద్దనూరుకు బదిలీ అయ్యారు. సీఐతో పాటు హెడ్‌కానిస్టేబుళ్ళు నాగరాజు, శ్రీనివాసులు విధుల్లో చేరారు. సర్కిల్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ నేరాల అదుపునకు కృషిచేస్తానని సీఐ తెలిపారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు జిల్లా పరిషత్ పాఠశాలలోని ఇంటర్ విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యార్థులకు చంద్రశేఖర్‌రెడ్డి యూనిఫాంను అందజేశారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డిని విద్యార్థులు, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్లస్ ఉపాధ్యాయులు సావిత్రమ్మ, చంద్రశేఖర్, సూర్యనారాయణరెడ్డి, రామాంజనేయులు, విమల కుమారి, డెవిడ్ రాజు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

నియామావళికి విరుద్ధంగా అధికారుల బదిలీలు

పులివెందుల రూరల్ : పులివెందుల, వేముల మండలాల తహసీల్దార్ కార్యాలయంలో కొంతమంది గ్రామ రెవెన్యూ అధికారులు గత పదేళ్లుగా ఇదే మండలంలో విధులు నిర్వహిస్తున్నారని, అయితే ప్రస్తుతం జరిగిన సాధారణ బదిలీల్లోనూ వీరిని వేరే మండలాలకు కేటాయించకుండా మళ్లీ ఇదే మండలానికి కేటాయించారని ప్రజలు వాపోతున్నారు. ఇలా చేయడం బదిలీల నియమావళికి విరుద్ధమని, ఇలా ఒకే మండలంలో బదిలీలు జరగడానికి కలెక్టర్ కార్యాలయ్యంలో కొంత మొత్తంలో డబ్బులు చేతులు మారాయని ప్రజలు అనుకుంటున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

శాస్త్రీయ దృక్పథం, పోటీతత్వం అలవర్చుకోవాలి

- ముగిసిన మండల స్థాయి చెకుముకి పోటీలు
- బహుమతులు ప్రదానం చేసిన నిర్వాహకులు, ఉపాధ్యాయులు

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మంగళవారం సమగ్ర శిక్ష, జన విజ్ఞాన వేదిక సంయుక్త నిర్వహణలో మండలస్థాయి చెకుముకి పోటీలను నిర్వహించినట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు తెలిపారు. ఈ పోటీలలో మొత్తం 18జట్లు పాల్గొనగా ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మొదటి బహుమతిని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, రెండో బహుమతిని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, మూడో బహుమతిని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుచుకున్నారు. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో స్వామి వివేకానంద పాఠశాల, శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలల విద్యార్థులు వరుస స్థానాల్లో నిలిచారు. విద్యార్థులకు సర్టిఫికెట్స్ మెడల్స్, మెమెంటోలను ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, మండల ఎంఈఓ–2 స్టాలిన్‌లు అందజేశారు.

తొండూరు : మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని ఇనగలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారని ఆ పాఠశాల హెడ్‌మాస్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే ద్వితీయ, తృతీయ స్థానాలను తొండూరు, అగడూరు ఉన్నత పాఠశాలలు సాధించినట్లు ఆయన తెలిపారు.

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో అహోబిలాపురం హైస్కూలు విద్యార్థుల జట్టు విజేతగా నిలిచారని ఆ పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు చంద్రశేఖరరావు, రామానాయుడు, జేవీవీ కన్వీనర్ నాగేంద్ర, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేముల : చెకుముకి మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో వేముల ఉన్నత పాఠశాల విద్యార్థుల జట్టు మొదటి స్థానంలో నిలిచిందని పాఠశాల హెడ్‌మాస్టర్ నాగిరెడ్డి మంగళవారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు షీల్డ్‌తోపాటు మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పులివెందుల టౌన్ : విద్యార్థులకు మెమెంటోలను అందిస్తున్న అధికారులు

చక్రాయపేట : విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పొన్నతోట గంగాధర రెడ్డి పేర్కొన్నారు. మంగ్లవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చక్రాయపేట జెడ్పీ హైస్కూల్‌లో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రాయపేట జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు చేతుల మీదుగా విజేతలకు మెమెంటోలు, మెడల్స్, సర్టిఫికెట్‌లు అందజేశారు.

చెకుముకి విజేతలకు బహుమతుల ప్రదానం

ఎర్రగుంట్ల : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి పోటీ పరీక్షలలో విజేతలకు మంగళవారం బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. మండల విద్యాధికారి శివప్రసాద్ విద్యార్థులకు మెమెంటోలు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, జేవీవీ కార్యదర్శి సుజన్‌కుమార్, ఉపాధ్యాయుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన చెకుముకి పోటీలు

వీరపునాయునిపల్లె : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి పోటీలు మంగళవారం ముగిశాయి. ఎంఈవో–2 అనిత కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మూఢనమ్మకాలను నియంత్రించి.. అందరికీ అవగాహన కల్పించే మంచి సంస్థ జేవీవీ అన్నారు. జేవీవీ మండల శాఖ అధ్యక్షుడు బేరిమోమన్ మాట్లాడుతూ చెకుముకి పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని, ఉరుటూరు, గంగిరెడ్డిపల్లి, పాయసంపల్లె విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుచుకున్నారని పేర్కొన్నారు.

‘చెకుముకి’తో శాస్త్రీయ దృక్పథం పెంపు

జమ్మలమడుగు : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి చెకుముకి పోటీలు దోహదపడతాయని జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర, మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టులో గెలుపొందిన విద్యార్థులకు గడియారం సాహితి పీఠం సభామందిరంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు శ్రీరాములు, సుబ్బయ్య, ఖలందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చెకుముకి విజేతలకు బహుమతుల ప్రదానం

ఎర్రగుంట్ల : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి పోటీ పరీక్షలలో విజేతలకు మంగళవారం బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. మండల విద్యాధికారి శివప్రసాద్ విద్యార్థులకు మెమెంటోలు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ నెల 27వ తేదీన జిల్లా స్థాయిలో కడపలో జరిగే చెకుముకి పరీక్షలలో విజేతలు పాల్గొంటారని జేవీవీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, జేవీవీ కార్యదర్శి సుజన్ కుమార్, ఉపాధ్యాయుడు బాలకృష్ణ పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయికులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పులివెందుల టౌన్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కళాశాల అసోసియేట్ డీన్ మాధవ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయోలా డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో మంగళవారం వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు కరస్పాండెంట్ ఆంటోని ఆరోక్యస్వామి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అమల్ ఆరోక్యరాజు, వైస్ ప్రిన్సిపల్ వన చిన్నప్ప, కళాశాల ఎన్.ఎస్.ఎస్. కో–ఆర్డినేటర్ కళ్యాణి రెడ్డి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వికసిత భారత్‌కు మూలం స్వచ్ఛత

వేంపల్లె : పట్టణంలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ యోగాంజనేయులు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ‘స్వభావ స్వచ్ఛత – సంస్కార స్వచ్ఛత’ జరిగిన సేవా కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ సంపతి దివిజా మాట్లాడుతూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అనేక దేశాలు అభివృద్ధి చెందాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభావంతులైన వలంటీర్లను గుర్తించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ నాగలక్ష్మి దేవి, డాక్టర్ సుధాకర్, అరవింద్, బాల్కొండ గంగాధర్, మాధవరావు, పీడీ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.



పులివెందుల టౌన్ : ఫుడ్అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కమలాపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని కమలాపురం సీఐ ఎస్‌కే.రోషన్, కమిషనర్ పగడాల జగన్నాథ్ అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వామి వివేకానంద హైస్కూల్ విద్యార్థులు పోలీస్, తహసీల్దారు, కోర్టు కార్యాలయాల ఆవరణలో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఐ, కమిషనర్ మాట్లాడుతూ ప్రజలంతా తమ పరిసరాలు శుభ్రంగా ఉంచుకున్నపుడే గాంధీ కలలు కన్న స్వచ్ఛ భారతదేశాన్ని చూడగలుగుతామని అన్నారు.

‘పర్యావరణ సంహిత’ ఆధునిక సమాజానికి అద్దం

జమ్మలమడుగు రూరల్ : పర్యావరణ సంహిత పుస్తకం నేటి ఆధునిక సమాజానికి అద్దం పడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బండారు శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మెయిన్‌బజార్‌లోని కోదండ రామాలయంలో కొరటమద్ది శర్మ గారి నరహరి రచించిన పర్యావరణ సంహిత పుస్తకాన్ని ఆవిష్కరించారు. బండారు శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ పుస్తకం అందరికీ ఉపయోగపడుతుందని చెప్పారు. ఆంగ్ల ఉపాధ్యాయుడైన నరహరి రామాయణంలోని పర్యావరణాన్ని పరిశోధించి పర్యావరణ సంహిత పుస్తకాన్ని రచించడం ఆనందంగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గడియారం వెంకట శేష శర్మ దంపతులు, మిరియాల శివ గణపతి, నరసింహులు పాల్గొన్నారు.

పంట మార్పిడి పద్ధతులు పాటించాలి

కొండాపురం : రైతులు సాగులో పంటల మార్పిడి పద్ధతి పాటించాలని తద్వారా అధిక ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు వి. వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బురుజుపల్లె, యనమలచింతల గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతిసారి ఒకే రకమైన పంటను వేయకుండా తరుచు పంటల మార్పిడి చేయడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని రైతులు ఈ దిశగా ప్రయత్నించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏవీ రామాంజనేయులరెడ్డి, వీహెచ్ఏ సురేష్‌బాబు, వీఏఏ కన్నబాబు, రైతులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోందిలో వ్యవసాయ అధికారులు

మేలైన విత్తన రకాలను ఎంచుకోవాలి

కమలాపురం : పంటల సాగు చేసే రైతులు వ్యాధి నిరోధక శక్తి గల మేలైన వంగడాలను ఎంపిక చేయాలని ఏఓ సరస్వతి సూచించారు. మండలంలోని టి.చదిపిరాళ్ల, రామచంద్రాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, మమత, లతాకుమారి, సోనియా, రైతులు పాల్గొన్నారు.

రబీ పంటలు సాగు చేసుకునే రైతుల కోసం 4460 క్వింటాళ్ల శనగ విత్తనం మంజూరైనట్లు ఏఓ సరస్వతి తెలిపారు. క్వింటా ధర రూ.9400 ఉండగా, 25 శాతం రాయితీ పోనూ రూ.7050 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు.



కమలాపురం: చదిపిరాళ్ల వద్ద మినుము పంట పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

విత్తన శుద్ధితో అధిక దిగుబడి

వీరపునాయునిపల్లె : విత్తనశుద్ధి చేయస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని ఏవో శ్యాంబాబు అన్నారు. మండలంలోని వెంకటాపురం, గార్లమిట్టపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రబీలో శనగ సాగు రైతులు తప్పని సరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. శనగ పంటకు ఆశించే వేరుకుళ్లు, ఎండు తెగులు అధికంగా సోకుతోందని, ట్రైకోడెర్మావిరిడి వాడితే ఫలితం ఉంటుందని తెలిపారు.

పులివెందుల రూరల్ : పంటలు సాగు చేసేముందు విత్తన శుద్ధి తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారిణి నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామానికి చెందిన అంకిరెడ్డి సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. మాట్లాడుతూ పత్తి పంటలో రసం పీల్చు పురుగు నివారణకు పసుపు, తెలుపు పల్లాలు ఎకరానికి 20 చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం హెచ్ఓ. రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ అరటి పంటలో ఎక్కువగా సిగటోక తెగులు వర్షాకాలంలో వస్తుందని, వాటి నివారణకు మందులను పిచికారీ చేయాలన్నారు.

వరిలో యూరియా వాడకం తగ్గించాలి

చక్రాయపేట : వరిపంట సాగు చేసిన రైతులు యూరియా వాడకం తగ్గించాలని ఎంటమాలజీ శాస్త్రవేత్త శిల్పకళ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మారెళ్లమడక తిమ్మారెడ్డిగారిపల్లెల్లో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిపంటలో ఉన్న తెగుళ్లను గుర్తించి యూరియా వాడకం నిలిపివేసి పంటలకు 13-0-45 లేదా 0-0-5 స్ప్రే చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆత్మ డీపీఓ పద్మలత, రైతు శిక్షణా కేంద్ర అధికారి నాగభూషణరెడ్డి, ఏఓ నవంత్‌బాబు, ప్రకృతి ఏఓ ప్రతాప్, ఏఈఓ అంజలి రైతులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో వ్యవసాయం లాభసాటి

లింగాల : రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించి లాభసాటి వ్యవసాయం చేయాలని మండల వ్యవసాయాధికారి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం లింగాల మండలం వెలిదండ్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రమేష్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు సలహాలు పాటించాలన్నారు. అలాగే రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలన్నారు. పశువైద్యాధికారి సుబ్బారాయుడు మాట్లాడుతూ పశు బీమా పథకం, ఆడ దూడలు పుట్టేందుకు ఎద సూదులు సబ్సిడీలో ఉన్నాయన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపైన అవగాహన పెంచుకోవాలన్నారు.

స్వచ్ఛంద రక్తదాతలకు కృతజ్ఞతలు

వేముల : స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన వారికి యూసీఐఎల్ డీజీఎం సుమన్ సర్కార్, ఎస్ఎంఎస్ సీఈఓ ఖలీల్ సౌదాగర్‌లు ధన్యవాదములు తెలిపారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని వేముల మండలం యూరేనియం కార్పొరేషన్ ప్రాథమిక వైద్యశాల ఆవరణలో యురేనియం కార్పొరేషన్ యాజమాన్యం సామాజిక బాధ్యతగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని అధికారులు ప్రారంభించారు. శిబిరంలో యురేనియం సిబ్బంది, ఏపీ ఎస్‌పీఎఫ్ సిబ్బంది రక్తదానం చేశారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన రక్తదాతలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూసీఐఎల్ జీఎం సంజయ్ చటర్జీ, సీఎస్ఆర్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ రెడ్డి, సీఎస్ఆర్ కో–ఆర్డినేటర్ గంగిరెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్, వైద్యశాల మెడికల్ అధికారిణి డాక్టర్ బిందు, రక్తనిధి మెడికల్ అధికారిణి డాక్టర్ రేవతి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు, రాజులు రక్తనిధి వైద్యులు డాక్టర్ మారుతీ భార్గవ్, డాక్టర్ నాహీద్, ఎస్‌పీఎఫ్ సిబ్బంది అరుణ్, రాజు, భాను ప్రతాప్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న యూసీఐఎల్ డీజీఎం సుమన్ సర్కార్